కొబ్బరి... సస్యరక్షణే ఊపిరి

- వేసవిలో జాగ్రత్తలు అవసరం
- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

అంబాజీపేట: కోనసీమ పేరు చెప్పగానే ముందుగా గుర్తొచ్చేది కొబ్బరి పంట.. ఈ సాగులో సస్యరక్షణ చర్యలు పాటిస్తే సిరులే రైతుల ఇంట.. రానున్న వేసవిలో కొబ్బరి సాగులో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మార్చి నుంచి జూలై వరకూ ఈ తోటలు నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలి. లేకుంటే దిగుబడులపై ప్రభావం పడి నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వేసవిలో సగటున కాపు కాసే చెట్టుకు రోజుకు సుమారు 50 నుంచి 60 లీటర్ల వరకూ నీరు అవసరమవుతుంది. నీటి ఎద్దడికి గురైన కొబ్బరి తోటల్లో చెట్టు బలం క్షీణించే కొద్దీ పురుగులను తట్టుకునే సామర్థ్యం తగ్గిపోతుంది. ఈ సమయంలో చెట్టుపై ఏర్పడిన గాయాలలో ఎర్రముక్కు పురుగు, మొవ్వులో కొమ్ము పురుగు ఆశించే అవకాశముందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో సుమారు 90 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. ఈ రైతులు ముందస్తు చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చు.


కొబ్బరి చెట్టు మొదలులో డొక్కలు ఇలా పెడితే ప్రయోజనం

నీటి ఎద్దడికి గురైతే...

ముదురు కొబ్బరి చెట్ల ఆకులు వడిలిపోయి, వంగి ఉంటాయి. పూత కొద్దిగా రావడం, పిందె ఎక్కువగా రాలిపోవడం, పొత్తులలో ఆడపువ్వులు తక్కువగా ఉండి దిగుబడి తగ్గుతోంది. కాయలు తయారు కాకుండా నీటికాయ (బొండం) పరువంలోనే వాలి దిగుబడి రాదు. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి వేడిగాలులు సోకే వేసవి మాసంలో పూల ఫలదీకరణ తగ్గి, పిందె కట్టడం బాగా తగ్గుతుంది. కొబ్బరి దిగుబడి, కాయ సైజు, కొబ్బరి నాణ్యత కూడా అంతంతమాత్రంగా ఉంటుంది. నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న సమయాల్లో కొబ్బరి చెట్లు చనిపోయే ప్రమాదం ఉంది.

తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు

ఉష్ణోగ్రతలు, వేడి గాలులు, భూమి స్వభావాన్ని బట్టి తేమ ఆరకుండా కొబ్బరి చెట్లకు నీరు సక్రమంగా అందించాలి. వేసవిలో తేలికపాటి భూముల్లో 5 నుంచి 7 రోజుల వ్యవధిలో నీటి తడులను అందించాలి. చెట్టు చుట్టూ పళ్లెం చేసి బేసిన్ పద్ధతి ద్వారా కాని, డ్రిప్ పద్ధతి ద్వారా కాని నీటిని అందించాలి. చెట్టు నుంచి 2 మీటర్ల దూరంలో మీటరు లోతు, వెడల్పులో గాడి తవ్వి అందులో కొబ్బరి డొక్కలు అంచులు పైకి ఏండేటట్లు వరుసలుగా పరిచి మట్టి కప్పాలి. ఎండిన ఆకులు ముక్కలుగా నరికి చెట్టు చుట్టూ పళ్లెంలో వేయడంతో నేల వేడి తగ్గి, నీటి ఆవిరి తగ్గించి తడిగా ఉంచుతుంది.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



ఫిబ్రవరి నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రత అధికంగా ఉండే అవకాశం లేకపోలేదు. కొబ్బరి తోటల్లో వేసవిలో జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో పురుగులు, తెగుళ్లు ఎక్కువగా ఆశించే ప్రమాదముంది. శాస్త్రవేత్తలు సూచించిన జాగ్రత్తలు పాటిస్తే కొబ్బరి చెట్టు ఆరోగ్యంగా ఉండటమే కాకుండా అధిక దిగుబడి వస్తుంది. చెట్టు చుట్టూ తీసిన బేసిన్‌ల్లో పచ్చిరొట్ట మొక్కలను వేసుకోవాలి. దీనివల్ల కలుపు నివారణ సాధ్యమవుతుంది.

–డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు,
ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి, అంబాజీపేట

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు


వాడపాలెంలో పార్టీలో చేరిన వారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: వాడపాలెంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన అనేక మంది కార్యకర్తలు కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో చేరిన సుమారు 150 మందికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు బండారు వెంకటేశ్వరరావు, పి.సత్తిబాబు, బండారు అంజిబాబు, గండ్రోతు శ్రీదేవి, సీహెచ్ నాగలక్ష్మి, మట్టపర్తి ధనవెంకట్రావు, సీహెచ్ వెంకటరమణ, పోలాబత్తుల నాగభూలక్ష్మి తదితరులు ఉన్నారు.

పురుగు మందు పిచికారీ చేస్తుండగా అస్వస్థత

- బాధితులను ఆసుపత్రిలో చేర్పించిన నేతలు
- అండగా నిలిచిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి


ప్రభుత్వ ఆసుపత్రిలో కౌలురైతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: పంట పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తుండగా కౌలు రైతులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన సంధిపూడిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వైఎస్సార్ సీపీ నాయకులు వెంటనే వారిని ఆసుపత్రిలో చేర్పించడం, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సకాలంలో వైద్య సేవలు అందించేలా ఆదేశాలు ఇవ్వడంతో ఇబ్బంది తప్పింది. ఆ వివరాల్లోకి వెళ్తే.. సంధిపూడి పెద్దకాలువ రోడ్డులోని పంట పొలంలో కౌలు రైతులు జంగం సత్తిపండు, తాడి చక్రవర్తి, అంబటి గంగాధరరావు, కోటిపల్లి ఆదెయ్యలు పురుగు మందు పిచికారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మందు గాఢతకు వారు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు మోటుపల్లి వెంకన్న, పోలాబత్తుల చిన్న, తోరాటి గోవిందులు సత్వరమే స్పందించి ఆ కౌలు రైతులను ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కౌలురైతుల కుటుంబీకులను పరామర్శించి, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు విజ్ఞప్తి చేశారు. వైద్యపరమైన ఇతర ఖర్చుల కోసం బాధిత కుటుంబీకులకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. బాధితులు జంగం సత్తిపండు, తాడి చక్రవర్తి, అంబటి గంగాధరరావు, కోటిపల్లి ఆదెయ్యకు మెరుగైన వైద్యం సాయం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మానవతా దృక్పథంతో స్పందించిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత సిద్దిరెడ్డి శివ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే ప్రజలకు శ్రీరామరక్ష


శ్రీనివాసరావును అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అంబాజీపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలే ప్రజలకు శ్రీరామ రక్ష అయ్యాయని పార్టీ రాష్ట్ర నాయకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు అన్నారు. పి.గన్నవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా శ్రీనివాసరావును నియమించడంపై మండల పార్టీ అధ్యక్షుడు విత్తనాల శేఖర్ ఆధ్వర్యంలో అంబాజీపేట నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా ఆదివారం కలసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల పరిశీలకులుగా తనను నియమించడం పట్ల సీఎం జగన్, ఎంపీ, ఉభయ గోదావరి జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల నాయకులను కలుపుకొని వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అటువంటి నేతను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అలాగే జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌ను పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్‌తో పాటు నాయకులు మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి, పులిదిండి ఏడుకొండలు, మట్టపర్తి హరి, సూదాబత్తుల రాము, రాయుడు షన్ముఖ్, మట్టపర్తి యజ్ఞశ్రీ, పేరాబత్తుల కొండలరావు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ చారిత్రాత్మకం


అంబాజీపేటలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే చిట్టిబాబు

ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అంబాజీపేట: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందజేయడం చారిత్రాత్మకమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డు ఆవరణలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను తహసీల్దార్ జె.కమలకుమారి అధ్యక్షతన ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల పట్టాలు అందించడంతో పాటు ఆ స్థలంపై పూర్తి హక్కులూ పొందేలా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తుందన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అంబాజీపేట మండలంలో 1,032, పి.గన్నవరం మండలం ముంగండపాలెంలో 188 మంది మహిళలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశామన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు వలంటీర్ల ద్వారా అర్హులను గుర్తించి 90 రోజుల్లో వారికి లబ్ధిని చేకూరుస్తున్నామన్నారు. అర్హులందరికీ న్యాయం చేయాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాతే అధిక సంఖ్యలో ఇళ్ల స్థలాలు కేటాయించి మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలు పంపిణీ చేయడం చరిత్రలో ఇదే మొదటి సారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఏ ఒక్కరికి ఇళ్ల స్థలం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు పంపిణీ చేసిన లేఅవుట్లలో రోడ్లు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు కల్పించడం, ఇళ్లు నిర్మించడం వంటి చర్యలు తీసుకుంటుందన్నారు. రాబోయే రోజుల్లో సంక్షేమ పథకాలు అమలు కావాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం లబ్ధిదారులకు స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ అధ్యక్షుడు పీకే రావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, వైస్ ఎంపీపీలు సూదాబత్తుల లక్ష్మి భార్గవి, నేతల నాగరాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు విత్తనాల శేఖర్, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, కుసుమ శ్రీను పాల్గొన్నారు.

పి.గన్నవరం: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం జగన్ సుమారు 30 లక్షల మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి చరిత్ర సృష్టించారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పి.గన్నవరంలో 283 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయించిన ఇళ్ల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అందరూ ఆశీర్వదించాలని కోరారు. తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణ, సర్పంచ్ బొండాడ నాగమణి, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ


ముంగండలో భక్తులతో రద్దీగా ముత్యాలమ్మ వారి ఆలయం


ముంగండలో ముత్యాలమ్మ వారు

పి.గన్నవరం: ముంగండ గ్రామంలో దాతల సహకారంతో రూ.కోటితో పునర్నిర్మించిన ముత్యాలమ్మ వారి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, కోటేశ్వరరావు దంపతులు మహిళలకు పసుపు, కుంకుమ, రవికెలు పంపిణీ చేశారు. ముంగండలో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్తున్న తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పి.గన్నవరం మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి దుశ్శాలువాతో సత్కరించారు.

వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామంలోని బొలిశెట్టి వారిపాలెంలో వీరభద్రస్వామి సంబరం జరిగింది. వైనతేయ గోదావరి నదీ స్నానం, జమ్మిచెట్టుకు పూజ, గ్రామోత్సవం, ప్రభ ఊరేగింపు నిర్వహించారు. బాణసంచా కాల్పులు, మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ సంబరం ఆద్యంతం కనుల పండువలా జరిగింది. భక్తులు వీరభద్రస్వామి వారి నిప్పుల గుండం తొక్కారు. తర్వాత భక్తులకు అన్న సమారాధన చేశారు. బొలిశెట్టి వీరన్న కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సంబరాన్ని జరిపించారు.

అంతర్వేది క్షేత్రం.. ఆధ్యాత్మిక శోభితం


హంస వాహనంపై స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్థానిక చెరువులో నిర్వహించిన స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకూ పది రోజులపాటు నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవాలు భక్తులను భక్తిపారవశ్యంతో ఓలలాడించాయి. ఉత్సవాల్లో చివరిరోజు సాయంత్రం 5 గంటలకు పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారిని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ మూలవిరాట్‌కు విశేష పూజలు చేశారు. రాత్రి 8 గంటలకు ఉత్సవరులకు తిరుమంజనం, దర్పణసేవ, ధూపసేవ, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ద్వాదశ తిరువారాధన నిర్వహించారు. రాత్రి 9 గంటలకు శ్రీపుష్పోత్సవం, చెంగోలం విన్నపం, తీర్థగోష్ఠి, శ్రీస్వామివారి పవళింపు సేవ నిర్వహించారు.

విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు

అయినవిల్లి: కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా పేరొందిన అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం స్వామికి మేలుకొలుపు సేవ, వివిధ పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో అలంకరించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో భక్త దంపతులు పాల్గొన్నారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 45 మంది, ప్రత్యేక దర్శనంలో 614 మంది, శ్రీ లక్ష్మీ గణపతి హోమంలో 35 పాల్గొని పూజలు నిర్వహించారు. 24 మంది నూతన వాహన పూజలు చేయించుకున్నారు. 23 చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు జరిపారు. 9 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.88,825లు ఆదాయం లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, చైర్మన్ గుత్తుల నాగబాబు తెలిపారు.

వాడపల్లి అభివృద్ధికి విశేష కృషి

ఆత్రేయపురం: వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుపతితో సమానంగా ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, రాష్ట్ర హౌసింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి తెలిపారు. ఆదివారం వాడపల్లి వెంకన్న ఆలయం ఎదురుగా ఉన్న కోనేరు సుందరీకరణ, లైటింగ్ ఏర్పాటుకు రూ.32 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ స్వామివారి ఆలయం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా అభివృద్ధి చెందిందన్నారు. ఆలయం చుట్టూ రూ.4 కోట్లతో ప్రాకార మండపం నిర్మించామని, రూ.8 కోట్ల టీటీడీ నిధులు, రూ.2 కోట్ల సీజీఎఫ్ నిధులతో పుష్కరిణి అభివృద్ధి, వకుళమాత అన్నదాన భవనం నిర్మాణాలు చేపట్టామన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ప్రసాద స్కీమ్ ద్వారా రూ. 50 కోట్లతో పనులకు ప్రతిపాదనలు పంపామన్నారు. తొలిత వారికి ఆలయ ఆవరణలో కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్, సభ్యులు స్వాగతం పలికారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ ఎంఆర్‌కే దాస్ తెలిపారు. మండల పరిధిలోని జి.వేమవరం గ్రామానికి చెందిన ఏసురత్నం అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై మద్యం సీసాలు తరలిస్తుండగా పి.మల్లవరం బైపాస్ జంక్షన్‌లోని చెక్ పోస్టు వద్ద పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 78 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. మద్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామని, నిందితుడిని కోర్టు ఎదుట హాజరు పరుస్తామని ఎస్ఐ చిట్టిబాబు తెలిపారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా గ్రూపు-2 పరీక్ష


కొత్తపేట పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

కొత్తపేట: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూపు– 2 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ఎంపీడీఓ కె.వాణిని లైజనింగ్ ఆఫీసర్‌గా నియమించగా, ఆమె ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్, హెచ్ఎం అల్లూరి గోపాలరాజు పరీక్ష నిర్వహించారు. మొత్తం 300 మంది అభ్యర్థులకు 44 మంది హాజరుకాలేదు. 256 మంది పరీక్ష రాశారు. ఈ కేంద్రం పరిసరాల్లో సెక్షన్ 144, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు చేశారు. రావులపాలెం సీఐ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎం.అశోక్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ, డీఎస్పీ కేవీ రమణ, రూటు ఆఫీసర్‌గా ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాణి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

మలికిపురం: స్థానిక ఏఎఫ్‌డీటీ ప్రభుత్వ ఎయిడెడ్ జూనియర్, డిగ్రీ కళాశాలలో గ్రూప్–2 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 600 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఏర్పాట్లను ఎంపీడీఓ ముత్యం వీరాస్వామి నాయుడు, వ్యవసాయాధికారి ఎస్.రాకేష్ పర్యవేక్షించారు.

పి.గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గ్రేస్ డిగ్రీ కళాశాల, లక్ష్మీ ఐటీఐ కళాశాలల్లో నిర్వహించిన గ్రూప్–2 పరీక్షలకు 615 మంది అభ్యర్థులు హాజరయ్యారని పరీక్షల రూట్ ఆఫీసర్, డీఎస్ఓ పాపారావు తెలిపారు. 85 మంది గైర్హాజరయ్యారని వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


శంకరగుప్తంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రతులను అందిస్తున్న కమిటీ సభ్యులు

మలికిపురం: రానున్న శివరాత్రి పండుగను పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం– ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం శంకరగుప్తం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శివరాత్రి విశిష్టతను భక్తులకు వివరించారు. పలువురికి భగవద్గీత ప్రతులను అందించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక మామిడి కుదురు కమిటీ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, హనుమంతరావు, సుబ్బారావు, వెంకటకృష్ణ, కాశీ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ మాజీ చైర్మన్‌కు సతీ వియోగం


నామన కృష్ణవేణి (ఫైల్)

మామిడికుదురు: జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు మగటపల్లికి చెందిన నామన రాంబాబు భార్య కృష్ణవేణి (63) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె చనిపోయారు. రాంబాబును టీడీపీ అధినేత చంద్రబాబు ఫోన్‌లో పరామర్శించారు. అలాగే పలువురు పరామర్శించి సానుభూతిని తెలిపారు. కాగా కృష్ణవేణి అంత్యక్రియలు మంగళవారం స్వగ్రామంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఏఆర్ కానిస్టేబుల్‌కు సత్కారం


ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న పెద్దలు

పి.గన్నవరం: ఇటీవల ప్రమాదంలో చిక్కుకున్న ఏడుగురు ప్రయాణికులను రక్షించిన రాజమహేంద్రవరం ఏఆర్ కానిస్టేబుల్ నెల్లి శ్రీనివాసరావును ఆదివారం పి.గన్నవరంలో మమత స్వచ్ఛంద సేవాసమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో సత్కరించారు. బెల్లంపూడి వద్ద ఇటీవల కారు అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకుపోయిన సంఘటనలో.. కారులో ఉన్న ఏడుగురిని కానిస్టేబుల్ రక్షించిన విషయం విదితమే. శ్రీనివాసరావుకు మెమెంటో అందజేసి అభినందించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, డీటీ బి.గోపాలకృష్ణ, ఎస్సై బి.శివకృష్ణ, సర్పంచ్ బొండాడ నాగమణి, నాయకులు నల్లా పెదకాపు, రావూరి సత్యనారాయణ, పుచ్చకాయల సాధు, నేలపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

మలికిపురం: నియోజకవర్గంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు చేయనున్నారని కత్తిమండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆదివారం పేర్కొంది. ఉదయం 9 గంటలకు ఈదరాడలో సచివాలయ భవనం ప్రారంభించి, ఇళ్ల పట్టాల పంపిణీలో పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు ఈదరాడలో వెల్‌నెస్ సెంటర్, అదే గ్రామంలో 10.30 గంటలకు రైతు భరోసా కేంద్రాన్ని, మధ్యాహ్నం 2 గంటలకు మోరిలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారు. తర్వాత మోరిలో సీసీ డ్రైన్‌కు శంకుస్థాపన, అనంతరం గడపకూ మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభిస్తారు.

వైభవంగా పుష్పోత్సవం

అంబాజీపేట: మాచవరం శివారు కోటివారి అగ్రహారం గ్రామంలో కొలువుదీరిన భువనేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఆదివారం రాత్రి స్వామివారికి పుష్పోత్సవాన్ని నిర్వహించారు. పుల్లేటికుర్రులో వేంచేసి ఉన్న శ్రీభూ సమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి పుష్పోత్సవాన్ని జరిపారు. అంతకు ముందు స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అప్పనపల్లిలో భక్తజన కోలాహలం


అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం మాఘ మాసం ఆదివారం సందర్భంగా భక్తులతో కోలాహలంగా మారింది. వైనతేయ గోదావరి నదిలో అధిక సంఖ్యలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన బాల బాలాజీ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం లక్ష్మీ నారాయణ హోమం కన్నుల పండువగా జరిగింది. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.1.76 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.17 లక్షలు, అన్నదానం ట్రస్టుకు రూ.58,472 విరాళాలుగా వచ్చాయి. స్వామివారిని 3,185 మంది భక్తులు దర్శించుకోగా, 2,169 మంది అన్నప్రసాదం స్వీకరించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు.

వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

అయినవిల్లి: కె.జగన్నాథపురంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ 86వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల జెడ్పీటీసీ సభ్యురాలు గంగుమళ్ల కాశీఅన్నపూర్ణ, శ్రీనివాస్ దంపతులు, చెడి తాలింఖానా ఫౌండేషన్ ట్రస్ట్ అధినేత, కాపునాడు కార్యనిర్వాహక అధ్యక్షుడు అబ్బిరెడ్డి సరేష్, మూర్తి, నల్లా నాగు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన ప్రసాదం స్వీకరించారు.

ఎస్సీల అభ్యున్నతికి పథకాలు

అంబాజీపేట: ఎస్సీల అభ్యున్నతికి ప్రధాని మోదీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పొనుగుపాటి శ్రీనివాస్, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి కొల్లి సూర్యారావు అన్నారు. కముజువారిలంకలో దళిత రచ్చబండ కార్యక్రమాన్ని పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పలువురికి నాయకులు అందజేశారు. కార్యక్రమంలో చెరుకూరి గోపాలకృష్ణ, పితాని శ్రీనివాస్, బొక్కా రాంబాబు, గంటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

28న ఉద్యోగ మేళా

కొత్తపేట: రాజమహేంద్రవరంలో 28న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.వాణి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ విభాగం ఆధ్వర్యంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు జోన్–2 రీజినల్ జాబ్ మేళా రాజమహేంద్రవరం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ వద్ద జరుగుతుందన్నారు. ఈ మేళాకు 121 కంపెనీలు వస్తుండగా, ఆయా కంపెనీల్లో 18 నుంచి 35 ఏళ్ల వయసు వరకూ టెన్త్ నుంచి గ్రాడ్యుయేషన్ విద్యార్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. అభ్యర్థుల విద్యార్హత, ఉద్యోగాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ.35 వేలు, కొన్ని ఉద్యోగాలకు రూ.50 వేల వరకూ జీతం ఉంటుందన్నారు. ఈ మేళాను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.